

వంతెన పనులు అంతేనా..?

పాములేరువాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి 13 నెలలు గడిచినా పనులు ప్రారంభించలేదు. 8లో



ఘనంగా వనసమారాధన

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. 9లో

గరిష్టం/కనిష్టం 28°/16°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

మైసూర్‌లో జగదభిరాముడి కల్యాణం



మైసూర్‌లో స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌లో భద్రాచలం శ్రీ సీతారాముడి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీరామ ప్రచార రథం ద్వారా చేరుకున్న స్వామివారికి అక్కడి భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను కొలువుదీర్చారు. కల్యాణతంతును కమనీయంగా నిర్వహించారు. మైసూర్‌కు తరలివచ్చిన సీతారాములను భక్తులు దర్శించుకుని పరమానందభరితులయ్యారు. ఆలయ ఈవో ఎల్.రమాదేవి, అర్చకులు, పండితులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా దేవస్థానం అంతరాలయంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మంత్రి సీతక్క



నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

పినపాక: కార్యకర్తలకు అండగా ఉంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల పరిధిలోని ఈ.బయ్యారం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గట్ల శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని ఆదివారం ఆమె పరామర్శించారు. అనంతరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు తోడ్పాటునందిస్తాం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

అశ్వాపురం: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు, వలస ఆదివాసీలకు విద్య, వైద్య సేవలు అందించేందుకు తోడ్పాటు అందిస్తామని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మనుబోతులగూడెం గ్రామ పంచాయతీ వేములూరు గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం రోటరీ క్లబ్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో అనుభవజ్ఞులైన అశ్వాపురం వైద్యాధికారి సంకీర్తన, మణుగూరు, భద్రాచలం వైద్య నిపుణులు పాల్గొని సేవలు అందించారు. శిబిరానికి గిరిజనులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 350 మంది వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లను ఎస్పీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సైలు తిరుపతిరావు, రవూఫ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.

సాగునీరు పుష్కలం..



పూర్తి స్థాయి నీటిమట్టంతో కళకళలాడుతున్న తాలిపేరు జలాశయం

- నిండుకుండను తలపిస్తున్న తాలిపేరు జలాశయం
- రబీలో రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేయనున్న అధికారులు
- మార్చి 31 తర్వాత ప్రాజెక్ట్‌కు మరమ్మతులు
- యాసంగి వరినారు పోసేందుకు సిద్ధమవుతున్న రైతులు



సిద్ధం చేసిన నారుమడి

చర్ల: తాలిపేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా అధికారికంగా 24,700 ఎకరాలకు, అనధికారికంగా మరో 10 వేల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశారు. అయినా ప్రాజెక్ట్‌లో జలకళ తగ్గలేదు. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన ఆయకట్టుదారుల సమావేశంలో తాలిపేరు ప్రాజెక్టు నుంచి రబీ సీజన్‌లో రెండో జోన్‌కు నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. మరమ్మతుల నేపథ్యంలో మార్చి 31 వరకే సాగునీటిని విడుదల చేస్తామని అధికారులు పేర్కొనగా, రైతులు ముందస్తుగా రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

సుమారు 34 వేల ఎకరాలకు సాగునీరు...

తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్ నుంచి ఏటా ఖరీఫ్‌లో చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని సుమారు 34 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. రబీలో మాత్రం రొటేషన్ పద్ధతిలో మూడు జోన్లలో.. ఒక్కో సంవత్సరం ఒక్కో జోన్‌కు ఆరుతడి పంటలకు సాగునీరు విడుదల చేస్తున్నారు. ఈసారి రెండో జోన్‌కు కుదునూరు సమీపంలోని ఆర్‌డీ 8 నుంచి కెనాల్ నుంచి దుమ్ముగూడెం మండలంలోని నడికుడి సమీపంలో గల ఆర్‌డీ 24 కెనాల్ వరకు సాగునీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. ఏటా వర్షాకాలంలో భారీగా వరద నీరు వచ్చి చేరుతుండగా, ప్రాజెక్ట్ కెపాసిటీకి మించడంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో లక్షలాది క్యూసెక్కుల జలాలు గోదావరి పాలవుతున్నాయి. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తూ ఉంటారు. ఈ ఏడాది భారీగా వర్షాలు కురవడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం 73.98 మీటర్లుగా ఉంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని వృథాగా పోనీయకుండా అధికారులు ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టాన్ని కొనసాగిస్తున్నారు.

మరమ్మతు పనుల నేపథ్యంలో...

రబీలో రెండో జోన్‌కు మార్చి 31 వరకే సాగునీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. గతేడాదే కాలువలు, ప్రాజెక్ట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. అప్పట్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభించలేదు. ఈ ఏడాది రబీ పంటకు పూర్తిగా సాగునీటిని నిలిపివేసి పనులు చేపట్టాలని అధికారులు భావించారు. కానీ రబీలో సాగునీటిని విడుదల చేయాల్సిందేనని రైతులు పట్టుబట్టడంతో మార్చి 31 వరకు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారు. అనంతరం నీటి విడుదలను నిలిపివేసి మరమ్మతులు చేపట్టనున్నారు. కాగా రెండో జోన్ పరిధిలోని రైతులు రబీ సాగుకు వరి నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు.

ఫారెస్ట్ 'సెల్'కు బ్రేక్!



అటవీ ప్రాంతంలో విధులకు వెళ్తున్న అధికారులు, సిబ్బంది(ఫైల్)

- ప్రభుత్వం అందించిన సిమ్‌కార్డులు పనిచేయని వైనం
- అటవీశాఖలో నిలిచిపోయిన సీయూజీ సెల్‌నంబర్ల సేవలు
- ఏడాదికాలంగా బిల్లులు రాక ఉద్యోగుల అవస్థలు
- జిల్లాలో సమాచారం చేరవేతకు అంతరాయం

పాల్వంచరూరల్: ఉద్యోగుల సౌలభ్యం, ప్రజలకు సత్వర సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొన్ని శాఖలకు ఉచితంగా సిమ్ కార్డులు అందజేసింది. ప్రతి నెలా రీచార్జి కూడా చేస్తోంది. అటవీశాఖ ఉద్యోగులకు కూడా కామన్ యూజర్ గ్రూప్ కింద అందరికీ ఉచిత సిమ్‌కార్డులను అందజేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉంది. ఈ క్రమంలో సమాచారవ్యాప్తి సులభమవుతుందని అడవుల సంరక్షణ, వన్యమృగాల సంరక్షణతో స్మగ్లర్లను అరికట్టవచ్చని భావించారు. అయితే ఏడాది కాలం నుంచి సిమ్ కార్డులు పనిచేయడంలేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు కొందరు సొంత డబ్బులతో రీచార్జి చేసుకుంటున్నారు. మరికొందరు సిమ్‌కార్డులను వినియోగించడం లేదు. బిల్లులు చెల్లించకపోవడంతో బకాయిలు కూడా పేరుకుపోయాయి. ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులు వినియోగిస్తే 24 గంటలపాటు ఆన్‌చేసి ఉంచేవారు. ఎప్పుడు ఏ అధికారి ఫోన్‌చేసి, ఏం సమాచారం అడుగుతారోనని ఉద్యోగులంత అప్రమత్తంగా ఉండేవారు. అటవీ ప్రాంతంలో సిగ్నల్ అందకపోయినా, స్విచాఫ్ చేసినా సంబంధిత అధికారులకు తప్పనిసరిగా సమాచారం అందించాలి. కానీ ఇప్పుడా పరిస్థితిలేదు. ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులు పనిచేయకపోవడంతో ఎవరికి వారు సొంత సిమ్‌కార్డులను వినియోగించుకుంటున్నారు. ఉద్యోగులు బదిలీలు, పదోన్నతుల కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోంది. దీంతో వారి సెల్‌ఫోన్ నంబర్లు మారి అక్కడి ప్రజల్లోకి చేరడం ఆలస్యమవుతోంది. దీంతో ఎవరైనా జంతువులను వధించినా, అక్రమంగా కలపను తరలించినా సమాచారం ఇవ్వాలంటే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా అక్రమార్కులకు ప్రయోజనం కలుగుతోంది.

జిల్లాలో 600 మంది..

జిల్లా అటవీశాఖలో సుమారు 600 మందికి సీయూజీ నంబర్లు ఉండేవి. పాల్వంచలోని (వైల్డ్‌లైఫ్) డివిజన్, మణుగూరు డివిజన్, కొత్తగూడెం డివిజన్, భద్రాచలం డివిజన్, పాల్వంచ డివిజన్లలో అటవీశాఖ ఉద్యోగులు, సిబ్బంది వీటిని వినియోగించారు. డీఎఫ్‌ఓ, ఎఫ్‌డీఓ నుంచి ఎఫ్‌ఎస్‌ఓ, ఎఫ్‌బీఓలు ఇలా వివిధ హోదాల్లో ఉన్నవారందరికీ సిమ్‌కార్డులను 2017 నుంచి ప్రభుత్వం అందజేసింది. వీటివల్ల అపరిమితంగా కాల్స్ చేసుకునేందుకు, ఇంటర్‌నెట్‌ను వినియోగించుకునేందుకు వెసులుబాటు ఉండేది. ఆయా సిమ్ కార్డుల వినియోగానికి ప్రతి నెలా ప్రభుత్వం బిల్లులు చెల్లించేది. ఏడాది కాలం నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో కొందరి సెల్ నంబర్లు పనిచేయడంలేదు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు చెల్లించి సెల్ నంబర్లను వినియోగంలోకి తేవాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



కాంపా స్కీమ్ ద్వారా జిల్లాలోని అటవీ శాఖ ఉద్యోగులకు ఉచితంగా సిమ్‌కార్డులు ఇచ్చి, రీచార్జి చేసేవారు. గత ఏడాది, ఆరు నెలల నుంచి బిల్లులు రావడం లేదు. . పాత సెల్‌ఫోన్ నంబర్లు పనిచేయకపోతే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కొందరు సొంత బిల్లులు చెల్లించుకుంటున్నారు. బిల్లుల మంజూరుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే అందరి సిమ్‌కార్డులు వినియోగంలోకి తీసుకొస్తాం.

–జి.కృష్ణాగౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి

ఎస్‌ఎఫ్‌ఐతోనే స్పందించే గుణం..

- రాజ్యాంగ పరిరక్షణకు ఇక్కడి నుంచే బీజాలు వేయాలి
- మతాన్ని జాతీయతతో ముడిపెట్టే ఆలోచనను వ్యతిరేకించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు
- ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా సాగిన వేడుక



ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఖమ్మంమయూరిసెంటర్: సమాజం పట్ల స్పందించే గుణాన్ని ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిందని ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థి, ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం తెలుగునాట రాజ్యాంగ పరిరక్షణకు బీజాలు వేయాలని ఆకాంక్షించారు. ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్ ఏచూరి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం ... రాజ్యాంగం పిలుస్తోంది' అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థి ఉద్యమ సమయంలో రాజ్యాంగంలోని మౌలిక విలువలు, మతం, లౌకికతత్వంపై ఘర్షణ పడ్డామన్నారు. ఇప్పుడు ఆ ఘర్షణ విశ్వరూపం చూస్తున్నామన్నారు. మత విశ్వాసాలున్న ప్రజలందరినీ వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, కానీ మతం ఆధారంగా రాజకీయ సమీకరణాలు, సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని, మతాన్ని జాతీయతతో ముడిపెట్టే ఆలోచనలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మన పోరాటం మతంపైన కాదు..మత ఉన్మాదంపైన అని స్పష్టం చేశారు.

విద్వేషంపై పోరాటంలో శ్రీకృష్ణుడు కూడా కలిసి వస్తాడు..

మత విద్వేషంపైనే జరిపే పోరాటంలో ఆఖరికి శ్రీకృష్ణ పరమాత్మ కూడా కలిసి వస్తాడని నాగేశ్వర్ చెప్పారు. భగవద్గీత ఏడో అధ్యాయం 21వ శ్లోకంలో శ్రీ కృష్ణుడు 'ఎవరికి ఎవరియందు భక్తి విశ్వాసాలు కలిగి ఉన్నా... వారిలో వారియందు భక్తి విశ్వాసాలను నేనే కల్పిస్తాను.. అర్జున' అని అన్నారని ఉదహరించారు. క్రీస్తును నమ్మేవాళ్లకు ఏసు పై, అల్లాను విశ్వసించే వారికి అల్లాపై విశ్వాసాన్ని కృష్ణుడే కల్పిస్తాడు... ఇక విద్వేషాలకు చోటెక్కడిది.? అని ప్రశ్నించారు. రాష్ట్రాల రాజకీయ ఉనికి, న్యాయవ్యవస్థ స్వయం ప్రతిపత్తి, భారతీయత భావనపైన దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక అసమానతలు రూపుమాపాలన్నారు. గంటకు గౌతమ్ అదానీ రూ.1600 కోట్లు సంపాదిస్తున్నారని, కానీ దేశంలో కటిక పేదరికంలో మగ్గేవారు అనేక మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి వి.కృష్ణయ్య మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక దేశం కార్పొరేట్ల రాజ్యంగా మారిందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కూడా హరించి వేస్తున్నారని, చివరకు పంట కాల్వల్లో పారే నీరు కూడా తమ నియంత్రణలో ఉంటుందని, దానికి కావాల్సిన డబ్బులు పంపించాలని రాష్ట్రాలకు కేంద్రం అల్టిమేటం జారీ చేసిందన్నారు.

తరలివచ్చిన 1500 మంది పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1500 మంది వరకు హాజరయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థులు, ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా ఉన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, నంది అవార్డు గ్రహీత దేవేంద్ర తదితరులు ప్రసంగించారు. ఎస్‌ఎస్‌ఐ పూర్వ విద్యార్థులు ఆలపించిన గేయాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీతారాంఏచూరి, జనవిజ్ఞాన వేదిక జీవ పరిణామం తదితర పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. తొలుత ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి మాటూరి రామచంద్రరావు సహా అసువులు బాసిన పూర్వ విద్యార్థులకు సంతాపం తెలుపుతూ తీర్మానాన్ని ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి ఏజే రమేష్ ప్రవేశపెట్టారు. సంఘ పతాకాన్ని సీనియర్ పూర్వ విద్యార్థి కొండపల్లి పావన్ ఆవిష్కరించగా, మరో విద్యార్థి ఉన్నం లక్ష్మీనారాయణ రాజ్యాంగ ప్రవేశిక పఠనం ప్రతిజ్ఞ చేయించారు. పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు, సమ్మేళనం కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, విప్లవ్ కుమార్, అనురాధ, కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షవర్గంగా ఈ కార్యక్రమం కొనసాగింది.

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. ఆదివారం డేటా ఎంట్రీపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీఓ సంజీవరావు, డీపీఓ చంద్రమౌళి, డీఈఓ వెంకటేశ్వరాచారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంసీలతో ఆన్‌లైన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ లోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. సోమవారం సాయంత్రం వరకు ఇంకా పూర్తికాని గృహాల సర్వేను పూర్తి చేయాలని అన్నారు. ఒక్కో డేటా ఎంట్రీకి ప్రభుత్వం రూ.7 చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రెండు షిఫ్టులలో డేటా ఎంట్రీ ప్రక్రియ చేపట్టాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మొదటిషిఫ్టు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు రెండో షిఫ్టు నిర్వహించాలని వివరించారు. అవసరమైన కంప్యూటర్లను ఐదు రోజులు అద్దెకు తీసుకువచ్చి అందుబాటులో ఉంచాలని అన్నారు. డేటా ఎంట్రీ కోసం తహసీల్దార్లు తమ మండలాల్లో లేదా పక్క మండలాల్లోని విద్యాసంస్థల ల్యాబ్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఆపరేటర్, ఎన్యుమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సర్వే పత్రాలను భద్రంగా, అత్యంత గోప్యంగా ఉంచాలని తెలిపారు.

'నకిలీ' దందా!

- డీసీసీబీలో తప్పుడు ధ్రువపత్రాలతో రూ.కోట్ల రుణాలు
- తాజాగా నకిలీ బంగారం తాకట్టుతోనూ లోన్‌లు..
- అధికారులు, ఉద్యోగుల కనుసన్నల్లోనే అక్రమాలు !



ఖమ్మం డీసీసీబీ ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం : డీసీసీబీ నకిలీ దందాలకు అడ్డాగా మారింది. తప్పుడు ధ్రువపత్రాలు, నకిలీ బంగారంతో కొందరు పెద్ద ఎత్తున రుణాలు తీసుకుంటూ బ్యాంకుకే కుచ్చుటోపీ పెడుతున్నారు. ఖమ్మం, భద్రాద్రితో పాటు మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో కలిపి 100 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలతో ఈ బ్యాంక్ విస్తరించి ఉంది. ఈ సంఘాలతో పాటు 176కు పైగా పరపతేతర సంఘాలు ఉన్నాయి. బ్యాంకు పరిధిలో 50 బ్రాంచ్‌లు ఉండగా, దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. అక్రమాల్లో కూడా రాష్ట్రంలో ఈ బ్యాంకుకు అంతే పేరు ఉంది.

నాలుగేళ్లు గడిచినా చర్యలేవి..?

2017లో ఖమ్మం నగరంలోని ఎన్‌ఎస్‌టీ, రోటరీనగర్, హెడాఫీస్ బ్రాంచ్‌ల నుంచి 21 మంది ప్లాట్లను మార్ట్‌గేజ్ చేసి రూ.6 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. 2020లో ఆ రుణాల రికవరీపై దృష్టి సారించగా నకిలీ ధ్రువపత్రాలతో మార్ట్‌గేజ్ రుణాలు తీసుకున్నట్లు బయటపడింది. ఈ వ్యవహారంపై స్థానిక అధికారులు, ఫ్రాడ్ కమిటీ, రాష్ట్ర కో – ఆపరేటివ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వివిధ కోణాల్లో విచారణ చేశారు. నాబార్డ్ కూడా ఇది అక్రమమని గుర్తించింది. బ్యాంకును మోసం చేశారంటూ నగరంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కొందరిపై కేసులు కూడా పెట్టారు. ఈ అక్రమం బయటపడి నాలుగేళ్లు గడిచినా ఇంతరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఖమ్మం రూరల్ బ్రాంచ్‌లోనూ నకిలీ ధ్రవపత్రాలతోనే 16 మందికి రూ.10 లక్షల చొప్పున రుణాలు ఇచ్చారు. ఈ వ్యవహారంపై మాత్రం విచారణ జరిపి బ్యాంకు మేనేజర్‌ను సస్పెండ్ చేశారు. ఏడేళ్ల కాలంలో ఈ బ్యాంకు నుంచి నకిలీ ధ్రవపత్రాల ఆధారంగా దాదాపు రూ.10 కోట్ల రుణాలు పక్కదారి పట్టాయి.

తాజాగా నకిలీ బంగారం తాకట్టుతో..

తాజాగా కొందరు బ్రాస్‌లెట్లు, ఇతర నకిలీ బంగారు వస్తువులు తాకట్టు పెట్టి రోటరీనగర్, అంబేద్కర్ మార్గ్, గట్టయ్యసెంటర్, ఎన్‌ఎస్‌టీ, హెడ్ ఆఫీస్ బ్రాంచీల్లో రుణాలు తీసుకున్నారు. వన్ గ్రాం గోల్డ్ తరహాలో కడియాలు, ఇతర వస్తువులపై కొంత మేర బంగారు పూత పూయించి స్వచ్ఛమైన బంగారంగా నమ్మబలికి రుణాలు పొందారు. రుణం ఇచ్చిన తర్వాత ఈ బంగారం నకిలీదిగా బ్యాంకు వర్గాలు గుర్తించాయి. ఇంకా ఇతర వాణిజ్య బ్యాంకుల్లోనూ నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారనే చర్చ కూడా జరుగుతోంది.

పేరుకే విచారణలు..

అక్రమాలపై జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో డీసీసీబీ, టస్కాబ్, కో – ఆపరేటివ్ రిజిస్ట్రార్ శాఖలు ప్రత్యేక కమిటీలతో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నాయి. అయితే ఉన్నత స్థాయిలో మాత్రం అధికారులు అంతగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పాలక వర్గాలు, రాజకీయ నాయకుల జోక్యంతో అక్రమార్కులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాలపై బ్యాంకు సీఈఓ వసంతరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. వారు స్పందించలేదు.

అధికారుల కనుసన్నల్లోనే..

నిబంధనల మేరకు ధ్రువపత్రాలను పరిశీలించి, ఆభరణాలు పరీక్షించి.. అవసరమైతే సంబంధిత నిపుణులు ధ్రువీకరించాకే రుణాలు ఇవ్వాలి. కానీ అలాంటి చర్యలేమీ లేకుండానే కొందరికి రూ.కోట్ల రుణాలను అధికారులు, ఉద్యోగులు ఎలా ఇచ్చారనేది అనుమానాలు రేకెత్తిస్తోంది. అంతా అధికారులు, ఉద్యోగుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారాలు కూడా వారు అక్కడి నుంచి బదిలీ అయిన తర్వాతే బయటపడుతుండడం గమనార్హం.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటన, సామాజిక కుల, గణన సర్వే ఉన్నందున కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

కరాటే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా నవీన్


బానోత్ నవీన్

జూలూరుపాడు: జిల్లాస్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పాపకొల్లు గ్రామానికి చెందిన బానోత్ నవీన్ ఎన్నికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలో జిల్లాస్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నవీన్ మాట్లాడుతూ జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించిన రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో బంగారు పతకం


పతకం అందుకుంటున్న చిరంతన్

గుండాల: తొమ్మిదో జాతీయస్థాయి కరాటే పోటీల్లో గుండాలకు చెందిన ఓ విద్యార్థి బంగారు పతకం సాధించాడు. మండల కేంద్రానికి చెందిన వాంకుడోత్ జగన్ కుమారుడు చిరంతన్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. అండర్–11 విభాగంలో కిజమ్ స్పోర్ట్స్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లో కుంగ్ ఫూ, కరాటే పోటీలు జరిగాయి. చిరంతన్ బంగారు పతకం సాధించగా.. పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటే అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

కొత్తగూడెంటౌన్: కరాటే అసోసియోషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కొత్తగూడెం ఓల్డ్ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో కమిటీ ఎన్నికైంది. జిల్లా కరాటే అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జి.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ ఇంద్రాల శ్రీధర్, వైస్ చైర్మన్‌గా జి.శ్రీనివాస్ యాద్, వైస్ ప్రెసిడెంట్‌లుగా జి.శ్రీకాంత్, ఈ రాధిక, టీ.వెంకటేశ్వర్లు, టి. ప్రణీత్, జాయింట్ సెక్రటరీలుగా బి. పవన్‌రెడ్డి, ఏ.రాజా, బి.నవీన్, ట్రెజరర్ మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.రాము, టీ. వీరభద్రం, బి.శివప్రసాద్‌తోపాటు పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కరాటే అసోసియేషన్ అబ్జర్వర్ వి.పిచ్చయ్య ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగిందని బాధ్యులు తెలిపారు.

యూనివర్సిటీ జట్టుకు హరిప్రియ ఎంపిక



పాల్వంచరూరల్: బాక్సింగ్ పోటీలో ప్రతిభ చూపిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని హరిప్రియ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైంది. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పొట్లపువ్వు హరిప్రియ వరంగల్‌లో ఇటీవల జరిగిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆదివారం కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి, ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవి అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

స్పెల్ బీ, మ్యాథ్ బీతో మేధస్సు

- భవిష్యత్‌కు దోహద పడేలా పరీక్షలు
- 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహణ.. విశేష స్పందన
- పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు


పరీక్షలను పర్యవేక్షిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు, సాక్షి బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా.. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సాక్షి మీడియా ఆధ్వర్యంలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలు నిర్వహించటం అభినందనీయమని రెజొనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు పేర్కొన్నారు. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలను ఆదివారం నగరంలోని రెజొనెన్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెజొనెన్స్ డైరెక్టర్లు మాట్లాడుతూ.. సాక్షి మీడియా ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని, తొలుత పాఠశాల స్థాయిలో పరీక్షలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి జిల్లాస్థాయిలో పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారు రీజినల్, రాష్ట్రస్థాయికి వెళ్తారన్నారు. స్పెల్ బీ విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా, మ్యాథ్ బీ విద్యార్థులకు గణితంపై మరింత ఆసక్తిని పెంచేలా ఈ పరీక్షలు ఉన్నాయని చెప్పారు. రెజొనెన్స్ కళాశాలలో జరిగిన పరీక్షా కేంద్రంలో నగరంలోని సర్వజ్ఞ, న్యూ విజన్, హార్వెస్ట్, బ్లూమింగ్ మైండ్స్, మిలీనియం, బ్లాసమ్స్, బీబీఎం, రెజొనెన్స్ ఇన్ఫో, రెజొనెన్స్ శ్రీనగర్, ఆక్స్‌ఫర్డ్, నిర్మల్ హృదయ్, త్రివేణి, మధిరలోని శ్రీనిధి, నారాయణ, సత్తుపల్లిలోని కేకేఆర్ గౌతమ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని త్రివేణి, భద్రాచలంలోని సెయింట్ పాల్స్ పాఠశాలలతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సాక్షి మీడియా గ్రూప్, అసోసియేట్ స్పాన్సర్ ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి, ప్రెసెంటింగ్ స్పాన్సర్ డ్యూక్స్ వ్యాఫీ వ్యవహరించారు. పరీక్షలను సాక్షి బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ పర్యవేక్షించగా... సాక్షి సిబ్బంది వేణు, ఏవీ రామారావు, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి'కి ధన్యవాదాలు



సాక్షి మీడియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగపడేలా సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలను నిర్వహించటం అభినందనీయం. ఈ పరీక్షలు భవిష్యత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయి. సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. పోటీ పరీక్షలు ఎంత సమయంలో రాయాలి.. ఎలాంటి సందేహాలు లేకుండా ప్రశాంతంగా ప్రశ్నలకు జవాబులు రాయడం కూడా తెలిసింది.

– పి.సాయిఊహన్, 4వ తరగతి, ఖమ్మం

కొత్త అంశాలు తెలుస్తున్నాయ్



స్పెల్ బీ పరీక్షను రాయటం ద్వారా కొన్ని కొదాలు, కొత్త అంశాలు తెలిశాయి. సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ పరీక్షను రాయటం ఆనందంగా ఉంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇలాంటి పరీక్షలు దోహదపడతాయి. ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహిస్తే విద్యార్థుల్లో ఉన్న భయం పోతుంది.

– ఎండీ సమ్రా ఫిరోదోస్, న్యూవిజన్, ఖమ్మం

ఆనందంగా ఉంది..



స్పెల్ బీ పరీక్ష రాయటం చాలా ఆనందంగా ఉంది. దీని ద్వారా విజ్ఞానం పెరుగుతుంది. పోటీ పరీక్షలను ఇప్పటి నుంచే రాయటం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి పరీక్షలనైనా సులభంగా రాసే అవకాశం ఉంటుంది. మరిన్ని పోటీ పరీక్షలను నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నా.

– పి.షరన్‌రోస్, శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్, మధిర

సబ్జెక్టుపై పట్టు వచ్చింది..



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష రాయటం ద్వారా ఇంగ్లిష్‌పై పట్టు వచ్చింది. ఈ పరీక్ష ద్వారా కొన్ని కొత్త విషయాలు తెలిశాయి. ప్రతి అంశంపై పట్టు సాధించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి. భవిష్యత్‌లో జరిగే పరీక్షలకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. ముమ్ముందు మరిన్ని పరీక్షలను నిర్వహించాలి.

– ప్రణయ, 9వ తరగతి, త్రివేణి స్కూల్, కొత్తగూడెం

పోటీ పరీక్షలకు ఉపయోగం..



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్ బీ పరీక్షను రాయటం ఆనందంగా ఉంది. ఈ పరీక్ష ద్వారా భవిష్యత్‌లో జరిగే పోటీ పరీక్షలను సులభంగా రాసేందుకు దోహదపడుతుంది. పోటీ పరీక్షలను ఏ విధంగా రాయాలనే అవగాహన వచ్చింది. సాక్షి మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు.

– లియాకత్ అర్షియాఖామ్, నందన్, 9వ తరగతి, సర్వజ్ఞ స్కూల్, ఖమ్మం

అవగాహన వచ్చింది..



మ్యాథ్ బీ పరీక్ష రాయటంతో అవగాహన వచ్చింది. ఈ పరీక్ష రాయటం ద్వారా కొత్త విషయాలు తెలియటంతో పాటు సబ్జెక్ట్‌పై మరింత పట్టు లభించింది. పరీక్ష సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలిసింది. ప్రశ్నాపత్రం తీసుకున్న సమయం నుంచి ముగింపు వరకు ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలనే విషయం తెలిసింది.

– ఆర్.నిధిసంహిత, 8వ తరగతి, రెజొనెన్స్ శ్రీనగర్ స్కూల్, ఖమ్మం

పోటీతత్వం పెరుగుతుంది



పోటీ పరీక్షలు రాయటం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుంది. పోటీ పరీక్షలు ఎలా రాయాలన్న అవగాహన పూర్తిస్థాయిలో లభించింది. పరీక్షలంటే ఉన్న భయం తొలగిపోయింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మ్యాథ్ బీ పరీక్షలు నిర్వహించటం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలు తెలుస్తాయి.

– పి.నందనసాయిభాను, 7వ తరగతి, కేకేఆర్ గౌతమ్ స్కూల్, సత్తుపల్లి


పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

జీడిపల్లి సమీపంలో ఎదురుకాల్పులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిపల్లి సమీపంలో నూతనంగా పోలీస్ క్యాంపు ఏర్పాటు కానుండగా, ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి జీడిపల్లికి వెళ్లిన సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్‌కు చెందిన పోలీసు బలగాలు తిరిగి వస్తున్న క్రమంలో మావోయిస్టులు పైకి కాల్పులు జరిపారు. బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారు. ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న జీడిపల్లిలో నూతనంగా క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్యాంపు ఏర్పాటవుతున్న ప్రాంతానికి ధర్మారం నుంచి తాత్కాలిక రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నూతన క్యాంపులు ఏర్పాటవుతున్న ప్రతీ సారి మావోయిస్టులు కాల్పులకు దిగడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారింది.

ఐఈడీ బ్లాస్ట్‌లో జవాన్‌కు తీవ్రగాయాలు


గాయపడిన జవాన్‌ను తరలిస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలి జవాన్‌కు తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయగూడలో కొత్తగా ఏర్పాటు చేసిన క్యాంపునకు చెందిన డీఆర్జీ జవాన్ పాడియం వినోద్‌గా గుర్తించారు. డీఆర్జీ బలగాలు మావోయిస్టుల కోసం రాయగూడ అడవిలో గాలింపు చేపట్టగా శనివారం రాత్రి 11 గంటల సమయంలో, మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఈడీ తగిలి జవాన్ గాయపడ్డాడు. ప్రథమ చికిత్స అనంతరం ఆయనను క్యాంపునకు తరలించారు.

వంతెన పనులు అంతేనా?

వెక్కిరిస్తున్న శిలాఫలకం
- శంకుస్థాపన చేసి ఏడాది దాటినంటి
- నేటికీ మొదలుకాని కుమ్మరిపాడు వంతెన పనులు


వాగు ఉధృతిలో కొట్టుకుపోతున్న తల్లీకూతుర్లు (ఫైల్)


13 నెలల కిందట ఏర్పాటు చేసిన శిలాఫలకం

ములకలపల్లి: పాములేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే తమ లోలెవల్ చప్టా తిప్పలు తప్పుతాయని ఆశించిన ప్రజల ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి 13 నెలలు గడిచినా, నేటికీ పనులు ఆరంభించపోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిధులు మంజూరైనప్పటికీ వంతెనను ఎప్పుడు నిర్మిస్తారోనని కుమ్మరిపాడు ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వర్షాకాలంలో వాగు వరదలో చిక్కుకుని ఒకరు మృతిచెందినా కూడా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని వారు పేర్కొంటున్నారు. చాపరాలపల్లి జీపీ కేంద్రానికి సమీపంలోని కుమ్మరిపాడు శివారు పాములేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.4.63 కోట్లు మంజూరయ్యాయి, అక్టోబర్ 5, 2023న నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇక పనులు మొదలవుతామని ప్రజలు ఆశించినా ఏడాది దాటినా ఎలాంటి పురోగతి లేదు. దీంతో పనులు ఎప్పుడు మొదలవుతాయా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ప్రమాదం జరిగినా.. పట్టింపేది?

వర్షాలు కురిస్తే ఎగువ భాగం నుంచి భారీగా ప్రవాహం ఈ వాగులోకి కలుస్తూ ఉంటుంది. దీంతో కుమ్మరిపాడు శివారులోని లోలెవల్ చప్టా పైనుంచి వరద ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఉధృతి తగ్గే వరకూ వేచి చూడాల్సి ఉంటుంది. జూలై 26, 2023లో వరినాట్లు వేసేందుకు వచ్చిన మహిళల బృందం చాపరాలపల్లికి వచ్చారు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లేలోగా భారీ వర్షం కురిసింది. చీకటి పడుతుండటంతో గత్యంతరంలేక ఒకరినొకరు చేతులు పట్టుకొని వాగు దాటుతుండగా తల్లీకూతుర్లు కుంజా సీత, కుర్సం జ్యోతి వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. కూతురు జ్యోతి ఎలాగోలా బయటపడగా.. సీత మృతదేహం మూడు రోజుల అనంతరం సమీప వాగులో లభ్యమైంది. ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో నిధులు మంజూరు కాగా, నిర్మాణ పనులు మాత్రం మొదలు కాకపోవడం శోచనీయం. ఇకనైనా పనులు మొదలుపెట్టి, రానున్న వానాకాలంలోగా పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడాది దాటినా పనులు మొదలు కాలేదు. ఇకనైనా వంతెన నిర్మాణం పట్ల దృష్టి సారించాలి. యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెట్టి, వంతెన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. అందుకు అందరూ సహకరించాలి.

– చీకటి ప్రకాష్, కుమ్మరిపాడు

జూన్ ఆఖరులోగా పూర్తిచేస్తాం



పాములేరు వాగుపై హైలెవల్ వంతెన పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. ఒప్పందం గడువు ప్రకారం వచ్చే ఏడాది జూన్ నెలాఖరులోగా వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఆ సమయానికి వంతెనను నిర్మించి..ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. వర్షాకాలంలోగా వంతెన పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయి.

– సుబ్బరాజు, ఏఈ, ఐటీడీఏ

కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి..


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పాల్వంచ: విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ఆదివారం పాల్వంచలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు వేడి నీళ్ల అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి దాసరి అనసూయ, ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలక గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ వెంకటేశ్ దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,600 నగదు, రెండు మోటారు సైకిళ్లు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

రేపు ఇంటర్వ్యూలు

కొత్తగూడెంరూరల్: అశ్వారావుపేటలో మొబైల్ మెడికల్ యూనిట్‌లో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు పోస్టుల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేసేందుకు ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎల్.భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10.30 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి రావాలని కోరారు.

కిన్నెరసానిలో సండే సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. మండలంలోని కిన్నెరసానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చారు. డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 498 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.17,190, 400 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,200 ఆదాయం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

అదుపుతప్పి మట్టికుప్పను ఢీకొన్న బైక్

ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం


రాజేశ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనం అదుపుతప్పి మట్టికుప్పను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి డివైడర్‌పై పడటంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆదివారం రాత్రి బ్రిడ్జిపాయింట్ వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని డిపోయూత్ కాలనీకి చెందిన దాసరి రాజేశ్ (27).. ఏపీలోని ఎటపాక మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన కిరణ్ కలిసి బైక్‌పై సారపాక వెళ్లి తిరిగి వస్తున్నారు. బ్రిడ్జి పాయింట్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న మట్టికుప్పను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు ఎగిరి పక్కనే ఉన్న డివైడర్‌పై పడ్డారు. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా రాజేశ్ మృతిచెందాడని ధ్రువీకరించారు. కిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. రాజేశ్‌కు తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. కాగా, రాజేశ్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే, చీకటిగా ఉండటమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

మోసం చేసినవారిపై కేసు

పాల్వంచ: చిట్టీ వేయించుకుని డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగిన ఇద్దరిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బొల్లేరుగూడెంనకు చెందిన తాళ్లూరి కృష్ణకుమారి, ఆమె కూతురు దీపికకు గట్టాయిగూడెంనకు చెందిన దొడ్డ బాలాజీ, కొలిపాక సాయిరాం కలిసి మాయమాటలు చెప్పి రూ.5లక్షల చిటీ వేయించారు. 30 నెలలు కట్టిన తర్వాత చిట్టీ డబ్బులు అడుగగా ఇవ్వకుండా ఆరు నెలలుగా తిప్పుకుంటున్నారు. ఈ విషయమై అడిగేందుకు దీపిక వెళ్లగా డబ్బులు ఇచ్చేది లేదని దూషించారు. చంపుతామంటు బెదిరించారు. దీంతో కృష్ణకుమారి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

పూరిల్లు దగ్ధం

టేకులపల్లి: ప్రమాదవశాత్తు పూరిల్లు, నగదు, సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు జోగా ముత్తయ్య, జోగా పొట్టయ్య నాగారంజోగు గ్రామంలో ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. రెండు రోజుల కిందట వారి పూరింటికి తాళం వేసి పంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు పూరిగుడిసెకు నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. బాధితులు వచ్చి చూసేసరికి అప్పటికే ఇల్లు, ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.